

# "లండన్లో సీతా కళ్యాణం"

## శ్రీ బాపు ప్రతిభకు విదేశీ పత్రికాధిపతుల ప్రశంస

పౌరాణికాలు ఎవరు చూస్తారండీ, పౌరాణికాలు ఎవరికి కావాలి అనే క్వశ్చన్ మార్కులకు, మద్రాసు ఫిల్మోత్సవ్ - 78లో కోరి, ఆనందలక్ష్మి ఆర్ట్ మూవీస్‌వారి "సీతా కళ్యాణం" చిత్రాన్ని తిలకించి మురిసిన విదేశీ పత్రికా ప్రతినిధుల రిమార్కులు సీతాకళ్యాణానికి ముత్యాల గొడుగు. శ్రీ బాపు ప్రతిభకు వెండిగొడుగు. మద్రాస్ ఫిల్మోత్సవ్ - 78లో కాస్త జాగా కూడా లభించని "సీతా కళ్యాణాని"కి లండన్లో అక్టోబరు, నవంబరు నెలల్లో జరుగనున్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎన్నిక కావడం పైవారి ఉత్తమాభిరుచులకు తార్కాణం మరియు మనవారి హ్రస్వ దృష్టికి చెంపపెట్టు.

లండన్ ఫిలిం ఫెస్టివల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ కెన్‌వలాషిన్, 'లండన్ టైమ్స్' పత్రికలో ఫిలిం క్రిటిక్ డేవిడ్ రాబిన్‌సన్, 'గార్డియన్' పత్రికా ప్రతినిధి డెరిక్ మాల్కమ్, సీతాకళ్యాణాన్ని కళ్ళారాచూసి దాన్ని అత్యున్నత ప్రమాణాలుగల ఉత్తమ చిత్రంగా ప్రశంసించడం, చవకబారు సినిమా అభిరుచులమీద గట్టి చురక. ఈ చిత్రాన్ని తెలుగువారే తిరస్కరించి శ్రీ బాపును విశేషంగా నిరుత్సాహపరిచారు.

ఇండియాలో కేవలం వెనుకబడినతనాన్ని, దారిద్ర్యాన్ని మాత్రమే వస్తువుగా స్వీకరించి కళాఖండాల్ని నిర్మిస్తున్న సంప్రదాయాన్ని విమర్శిస్తూ—విదేశీ పత్రికలవారు "సీతాకళ్యాణం" వంటి పౌరాణికాలు కళాఖండాలు కాజాలవా అని ఎత్తి పొడిచారు.

'గార్డియన్' పత్రిక ప్రతినిధి డెరిక్ మాల్కం యిలా వ్రాస్తున్నారు :

"రే"ను మినహాయిస్తే భారతీయ చిత్రాలను సీరియస్‌గా తీసుకోనవసరంలేదనే అభిప్రాయం సర్వత్రా వుంది. "రే" పట్ల విశేష గౌరవంతోనే - ఆ వాదన యిక ఎంతమాత్రం నిజం కాదని చెప్పవచ్చు.

వాస్తవానికి, అపరిచిత ప్రాంతాల నుంచి వచ్చిన ముప్పై కొత్త తరహా భారతీయ చిత్రాలను చూశాక అమెరికాని తప్పించి యిక ఏ యితర దేశాలలో నూయింత మంది చిత్రరంగంలో ఆశాజనకమైన దర్శకులు లేరని నా కనిపించింది. ఇంగ్లండులో యిప్పుడున్న పరిస్థితితో పోలిస్తే చాలా దిగులు కలుగుతుంది. మృణాల్ సేన్‌గాని శ్యాంబెనిగల్‌గాని (వారి చిత్రాలు చెరో రెండూ ఈ ప్రదర్శనలో వున్నప్పటికీ) అవి అభిమానింప దగినంత ఆశాజనకంగా లేవని చెప్పడం అసందర్భమే కావచ్చు. ఇరవై సంవత్సరాలుగా వున్న "నియోరియలిస్టిక్ స్కూలు" ప్రభావంలో "సెన్" ఛాలెంజింగ్‌గా వుండే రాజకీయ చిత్రాలు నిర్మిస్తూ వచ్చారు. 1974 లో 'అంకుర్' తరువాత బెనిగల్ అయిదు చిత్రాలతో "ఫాస్ బైండర్ ఆఫ్ఇండియా" అనిపించుకోగల శక్తిని సంపాదించుకున్నాడు. ఇండియాలో న్యూవేవ్ చిత్రాల నిర్మాణానికి హఠాత్తుగా వూపు నిచ్చినశక్తి గురించి- బహుశా మనం ఆశ్చర్య పోనవసరంలేదు యువచిత్ర నిర్మాతలకు గ్రాంట్లద్వారా భారత దేశంలో ప్రభుత్వ సహాయం అందడం వలన అది ఒక ఉద్యమంగా న్యూవేవ్ చిత్రాల నిర్మాణానికి కారణం కావచ్చు - (అది చాలదనే కొందరివాదన వున్నప్పటికీ) ఈ దేశం (బ్రిటన్) అటువంటిదేవీ సాధించుకోలేదు. ఇండియా కేవలం ప్రపంచంలో అందరికంటే ఎక్కువ చిత్రాలను నిర్మించే దేశం మాత్రమే కాదు.

ఇండియా ఫిల్మోత్సవంలో ప్రదర్శించిన చిత్రాలపరిధికి వెలుపల ఒక మహత్తరమైన చిత్రాన్ని కనుక్కున్నాము. అది బాపు 'సీతా కళ్యాణం'. ఈ ప్రాంతాలలో విశేష ప్రజాదరణ పొందుతున్న పౌరాణిక చిత్రాలను విదేశ ప్రముఖులు ఆదరించరనే అభిప్రాయంతో ఈ చిత్రానికి ఫిల్మోత్సవంలో ప్రవేశం తిరస్కరించారు. ఈ ఉత్సవ నిర్వాహకులు ఎంత పెడదారిలో ఆలోచించారు! నేను చూసిన అతివైభవోపేతమైన చక్కని చిత్రాలలో "సీతా కళ్యాణం" ఒకటి. ఆ చిత్రాన్ని చూడమని నేను తరచుగా చూసిన వారందరు నేను పొరపాటు పడలేదని హామీ ఇచ్చారు. నవంబరులో లండన్‌లో జరిగే చిత్రోత్సవంలో అది తప్పకుండా వుంటుంది."

ఈ గొడవంతా చూసి పాపం బాపు సహజంగానే ఆశ్చర్యపోయాడు. ఇండియాలోని ఉత్తమ దర్శకుల అధికార జాబితాలోకి చేరలేకపోయిన బాపు ఇప్పటికి పదమూడు చిత్రాలను తీశాడు. తనకు గుర్తింపు రానందుకు అతడు కొంత బాధ పడినప్పటికీ, తను మామూలు వ్యాపార చిత్రాలను తీసేవారి కంటె హెచ్చు జాగ్రత్తగా తీస్తానని ఒప్పుకున్నాడు. కాని, 'సీతాకళ్యాణం' దానికదే సాటి— సంథింగ్ స్పెషల్!

ఈ చిత్రాన్ని ముళ్ళపూడి వెంకటరమణ (రచయిత) కె. వి. మహదేవన్ (అత్యుత్తమ కర్ణాటక సంగీత కళానిధి) కె. ఎస్. ప్రసాద్ (ఛాయాగ్రాహకుడు) రవీనగాయిచ్ (ట్రిక్ ఫొటోగ్రఫీకి ఇండియాకి రేహేరీ హౌజన్ వంటివాడు) ఒక టీముగా బాపుతో కలిసి నిర్మించారు....ఫలితం— అచ్చమైన హాలీవుడ్ బైబిల్ చిత్రంలా, కవితా గుణాన్ని కావ్య గుణాన్ని పొందిన దృశ్య కావ్యంగా అవతరించింది. సాధ్యమైనంత వరకు సాధికారికమైన పౌరాణిక చిత్రణ జరిగింది., శతాబ్దాల క్రితపు చిత్రాలను (పెయింటింగ్సు) తీర్చినట్లు దృశ్యాలకు జోడించడం జరిగింది. చిత్రం బలీయమైన ఆకర్షణ కలిగి గంభీరంగా వుండేలా రూపొందించారు....ఆ చిత్రంలోని ఓజస్సు మనలను బాగా కదిలిస్తుంది. అటువంటిది నేనింత వరకూ చూడలేదు....పాశ్చాత్య దేశాలలో దాని ఖ్యాతి పెరిగి బహుళ జనాదరణ తప్పక పొందుతుందని నేను విశ్వసించకుండా వుండలేకపోతున్నాను. ఇండియాలో సీతాకళ్యాణం ఆర్థికంగా "ఫ్లాప్" కావడం నా విభ్రమాన్ని మరింత యినుమడింప చేసింది. ఎక్కువమంది తేలిగ్గా ఆనందించేందుకు వీలుగా నిర్మిస్తే సరిపోయేది బహుశా...."

'సీతాకళ్యాణా'నికి లండన్లో తప్పకుండా వైభోగంగా చిత్ర కళ్యాణం జరుగుతుందని ఆశించవచ్చు. మన మెవరమూ బాపును గొప్ప డైరెక్టర్లలోకి చేర్చకపోయినా, 'సీతాకళ్యాణం' ఆ పని చేసింది. అది సీతమ్మవారి చేతి చలవ అంటే బాపుగారు విపరీతంగా సంతోషపడిపోతారు. కానివ్వండి!

—పి. యస్.